క్లుప్తంగా

ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మందులు ఇస్తున్న సిబ్బంది

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కె.వెంకటపూర్ గ్రామంలో మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో అసైన్డ్ రాష్ట్ర భూ సమితి ప్రెసిడెంట్ బైండ్ల నందు సహకారంతో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ రాజిరెడ్డి హాజరయ్యారు. వైద్యాశిబిరాన్ని గ్రామంలో సుమారుగా 200 పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో బీపీ, షుగర్ పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, థైరాయిడ్, గర్భసంచి, సంబంధిత శరీర సంబంధ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రేమ, మల్లారెడ్డి ఆస్పత్రి బృందం డాక్టర్ పుజీత, మనీష, దుర్గా, స్తుతి హరి, సిబ్బంది సోని, గాయత్రి, మార్కెటింగ్ మేనేజర్ ఎండీ మహమ్మద్, హరికృష్ణ, గట్టు ప్రశాంత్ ఇతర నాయకులు సిద్ధరాములు, మధుసూదన్‌రెడ్డి, సోమన్న మహిపాల్, స్వామి, రాజేందర్, కాస కైలాస్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ

నర్సాపూర్: ఆక్రమణ దారుల నుంచి ఫుట్‌పాత్‌లను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డీఓ మహిపాల్ ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ జాన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు, ఎంపీఓ శ్రీనివాస్‌లతో పాటు పలువురు అధికారులతో రోడ్డు భద్రతా చర్యలు, ట్రాఫిక్ సంబంధిత సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఆయా దుకాణాలు, తోపుడు బండ్లు, హోర్డింగ్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించి కోర్టుకు పంపాలని సూచించారు.

ఉపాధ్యాయుడి పాత్ర కీలకం



రాజేశ్వర్‌రావును సన్మానిస్తున్న దుద్యాల ఆశ్రమ పీఠాధిపతి అంబికా శివయోగి

పెద్దశంకరంపేట(మెదక్): సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో కీలకమని దుద్యాల ఆశ్రమ పీఠాధిపతి అంబికా శివయోగి మహరాజ్ అన్నారు. గురువారం పెద్దశంకరంపేట జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కంది రాజేశ్వర్‌రావు పదవీ విరమణకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి చేసిన కృషి చేస్తున్న ఉపాధ్యాయులను కొనియాడారు. అనంతరం పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వెంకటేశం, ధనుంజయ్, బి.శ్రీనివాస్, రామచంద్రాచారి, మారుతి, కె.వి.రవీందర్, గోపి, రామకృష్ణాగౌడ్, ఎన్.శ్రీనివాస్, కుమార్, విఠల్, విజయ్‌కుమార్, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ధాన్యం తూకం



తూకం వేసి లారీలో లోడ్ చేస్తున్న ధాన్యం

సాక్షి ఎఫెక్ట్..

కొల్చారం(నర్సాపూర్): మండలంలో వరి ధాన్యం తూకం గురువారం ఎట్టకేలకు మొదలైంది. గురువారం సాక్షి దినపత్రికలో 'తూకం ఎప్పుడు?' అనే వార్త ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. సంగాయిపేట గ్రామంలో మంజీరా వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే లారీల్లో రైస్ మిల్లులకు తరలించే చర్యలు తీసుకున్నారు.

దొంగలకు వరంగా రైల్వేస్టేషన్లు

- జిల్లాలోని స్టేషన్లలో తాళాలు పగులగొట్టి సామగ్రి ఎత్తుకెళ్లిన దుండగులు
- రక్షణ కొరవడిన వైనం
- నిర్లక్ష్యంగా అధికారులు



ధ్వంసమైన షమ్నాపూర్ స్టేషన్ భవనం కిటికీలు



లక్ష్మాపూర్ రైల్వేస్టేషన్‌లో ధ్వంసం చేసిన కరెంట్ స్విచ్‌లు



షమ్నాపూర్‌లో గ్యాంగ్‌మెన్లు ఉండే గదులు, మరుగుదొడ్ల తలుపులు ఎత్తుకెళ్లిన దుండగులు

రామాయంపేట, హవేళిఘణపూర్(మెదక్): జిల్లాలో కాపలా లేని రైల్వేస్టేషన్లు దొంగలకు వరంగా మారాయి. కొన్నిస్టేషన్లలో ఆశాఖ సిబ్బంది కాపలా లేకపోవడం, అవి గ్రామానికి దూరంగా ఉండటంతో చోరులకు సులువుగా మారింది. రెండు స్టేషన్ల భవనాల తాళాలు పగులగొట్టిన దుండగులు ఫ్యాన్లు, గోడలకు బిగించిన కరెంట్ సామగ్రి, తలుపులు, పైపులు, బల్బులు, సామగ్రి ఎత్తుకెళ్లారు.

దొంగలపాలైన సామగ్రి

మెదక్, అక్కన్నపేట మధ్య నూతనంగా నిర్మించిన రైల్వే లైన్ మూడున్నర ఏళ్ల క్రితం ప్రారంభమైంది. ఈలైన్‌లో హవేళిఘణపూర్ మండలం శమ్నాపూర్, రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామాల శివారులో రెండు స్టేషన్లు నిర్మించారు. మొదట్లో కొన్ని రోజుల పాటు రైల్వేశాఖ పర్యవేక్షణ కొనసాగగా, ఆ తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. ఉదయం, సాయంత్రం మాత్రమే ఈ లైన్‌లో రైళ్లు తిరుగుతాయి. మిగతా సమయాల్లో నిర్మానుష్యంగా ఉంటుంది. ఈస్టేషన్లు రెండు గ్రామానికి దూరంగా ఉండి, జన సంచారం లేకపోవడంతో స్టేషన్ల సామగ్రి దొంగలపాలైంది. రెండు స్టేషన్లలో భవనాల తాళాలు పగులగొట్టిన దుండగులు ఆరు ఫ్యాన్లు, స్ట్రీట్ లైట్లు, బాత్ రూంలు, ఇతర గదులు డోర్లు, పైపులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర ఫర్నిచర్ ఎత్తుకెళ్లారు. గోడలోపలి భాగంలో బిగించిన కరెంట్ స్విచ్‌లు, వైర్లను, తాగునీటి కోసం కుళాయిల్లో బిగించిన నల్లాలను సైతం పెకిలించుకపోయారు. కిటికీలతో పాటు వాటి అద్దాలు ధ్వంసం చేశారు. గ్యాంగ్‌మెన్లు నివాసం ఉండే గదుల డోర్లను పెకిలించుకొని ఎత్తుకెళ్లారు. గ్రామాల సమీపంలో ఉన్న స్టేషన్లలో సామగ్రి దొంగలపాలైనా గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారే ఆరోపణలున్నాయి. ఈ స్టేషన్‌లో సీసీ కెమెరాలు, జన సంచారం లేకపోవడంతో రక్షణ కొరవడింది. ఈ విషయమై ఆశాఖ ఉన్నతాధికారి ఒకరిని సంప్రదించగా, రెండు స్టేషన్లలో సామగ్రి, ఇతర వస్తువులు ఎత్తుకెళ్లిన విషయం వాస్తవమేనన్నారు. వీటి భద్రతకై గ్రామస్తులు పర్యవేక్షించాలని, ప్రజలు తమ ఆస్తులుగా భావించాలన్నారు.

ఘనంగా బేతాళ స్వామికి బోనాలు



బోనాలు ఉరేగింపులో భక్తులు

అల్లాదుర్గం(మెదక్): బేతాళస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి భక్తులు బోనాలు ఊరేగించి సమర్పించారు. మహిళలు బేతాళ స్వామికి గండజ్యోతి నెత్తిపై పెట్టుకొని ఉరేగింపుగా వెళ్లి స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి సమర్పించుకున్నారు. గండజ్యోతి సమర్పిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. బేతాళస్వామి బోనాలు తిలకించేందుకు ఆయా గ్రామాల ప్రజలతో పాటు కర్నాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వచ్చారు. ఉత్సవాల్లో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు



పాపన్నపేట - మిన్‌పూర్ రోడ్డుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్

పాపన్నపేట(మెదక్): రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం ఆయన రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులకు అవగాహన కల్పించారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడం ద్వారా ప్రమాదాలు జరిగి, విలువైన ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా రాత్రిళ్లు ధాన్యం కుప్పలపై నల్లటి టార్పాలిన్లు కప్పడం ద్వారా, అవి కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అలాగే ధాన్యం కుప్పల చుట్టూ, రాళ్లు పెట్టి వాటిని అలాగే వదిలేస్తున్నారని, అవి కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయని తెలిపారు. రోడ్లపై కాకుండా మైదాన ప్రాంతాల్లో, ఖాళీ ప్రదేశాల్లో ధాన్యం ఆరబోసుకోవాలని సూచించారు.

కల్లాల వద్దనే ఆరబెట్టుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): రహదారులపై రైతులు ధాన్యం ఆరబెట్టొద్దని ఎస్‌ఐ నారాయణగౌడ్ సూచించారు. ఆయన మాట్లాడుతూ.. రహదారులపై ధాన్యం ఆరబెట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రహదారులపై జరిగే ప్రమాదాలకు రైతులపై కేసులు పెట్టాల్సిన పరిస్థితి వస్తుందని, ధాన్యం కల్లాల వద్దనే ఆరబెట్టుకోవాలని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో పైలట్ ప్రాజెక్టుకు ఎంపికైన గ్రామాలే కాకుండా ప్రతీ గ్రామంలోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎంపికైన లబ్ధిదారులను ఈ నెల 18 నుంచి 21 వరకు గుర్తించాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆనంద్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. భగీరథ నీటి సరఫరాలో లోపాలుంటే, స్థానికంగా ఉన్న రైతుల బోర్లు అద్దెకు తీసుకోవాలన్నారు. ఎక్కువగా తాగునీటి సమస్యలున్న గ్రామాల్లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేష్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి, ఏపీఓ శ్యామ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమతుల్య పోషకాహారంతో ఆరోగ్యం

జిల్లా సంక్షేమ అధికారి హైమావతి



సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

తూప్రాన్: గర్భిణులు, బాలింతలు సమతుల్య పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని జిల్లా సంక్షేమ అధికారి హైమావతి అన్నారు. తూప్రాన్ సెక్టర్ పరిధిలోని అంగన్‌వాడీ- 8వ కేంద్రంలో పోషణ పక్వాడ ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీడబ్ల్యూఓ (జిల్లా సంక్షేమ అధికారి) హైమవతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలు అందరూ మంచి పోషక విలువలు కల్గిన సమతుల్య ఆహారం తీసుకొని అందరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. గర్భిణులు గర్భం దాల్చిన రోజు నుంచి బిడ్డ పుట్టిన మొదటి రెండేళ్ల కాలాన్ని గోల్డెన్ డేస్ అంటారని తెలిపారు. బిడ్డ పుట్టిన మొదటి ఐదేళ్లు చాలా కీలకమైనవన్నారు. ఈ వయసులో పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఐసీడీఎస్ సీడీపీఓ హేమభార్గవి మాట్లాడుతూ.. పిల్లలు తీనాల్సిన ఆహారం, తాగునీరు, పరిశుభ్రత గురించి వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, ఆరునెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శివకుమారి, సుజాత, సంతోష, మెహతా, ఏఎన్ఎం రేణుక, గర్భిణులు, బాలింత తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఆరెగూడెం గ్రామశివారులో అదుపుతప్పి బైక్ బోల్తా పడింది. ఘటనలో కుకునూర్ వైపు నుంచి తన స్వగ్రామానికి వస్తున్న ఎల్కపల్లి గ్రామానికి చెందిన సాతెల్లి రమేశ్ తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని 108 వాహనంలో తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీంతో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

నేడు భూభారతిపై రైతులకు అవగాహన సదస్సు

నేడు కలెక్టర్ రాక

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని చెవెళ్ల గ్రామంలో శుక్రవారం భూభారతిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లయ్య గురువారం తెలిపారు. ఇందులో కలెక్టర్ పాల్గొని రైతులకు భూభారతిపై వివరిస్తారని, ప్రభుత్వం ఈ నెల 14న భూభారతిని అమలు చేసినట్లు ఆయన చెప్పారు. మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నర్సాపూర్: అగ్ని మాపక శాఖ వారోత్సవాలను పురస్కరించుకొని ఫైర్ స్టేషన్ సిబ్బంది గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్ మిర్జానజీంబేగ్, సిబ్బంది, ఫైర్ స్టేషన్ సిబ్బంది ఐలయ్య, యాదగిరి, రమేశ్, అనిల్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ అవసరం ఉన్నవారికి సికింద్రాబాద్‌కు తరలించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది సంఘం నాయకులు సూర్య ప్రకాశ్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని దొంతి గ్రామానికి చెందిన చెన్నయ్య, రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా పరామర్శించి రూ. 15 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. నవాబుపేట గ్రామానికి చెందిన సత్యనారాయణ, ఇమ్రాన్‌లు అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండడంతో చికిత్స నిమిత్తం కాంగ్రెస్ నాయకుడు నవీన్‌గుప్తా రూ. 10 వేలు ఇవ్వడంతో పాటు ఇదే గ్రామానికి చెందిన సహదేవ్, పోచయ్య, ప్రశాంత్ మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి రూ. 15 వేలు అందజేశాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పాఠశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు



మాట్లాడుతున్న నాగుల్‌మీరా

కౌడిపల్లి(నర్సాపూర్): పీపుల్స్ ప్రొగ్రెసివ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రగతి విద్యానికేతన్‌లో ఉచిత రెసిడెన్షియల్ విద్యకోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే నాగుల్‌మీరా, మండలాధ్యక్షుడు శేషగిరిరావ్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం 4, 5, 6వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికైన విద్యార్థులకు డిగ్రీ వరకు ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందిస్తామన్నారు. అనాథలు, తల్లి లేదా తండ్రి లేని పిల్లలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 18న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 24న మెదక్ న్యూహైస్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు యూటీఎఫ్ నాయకులకు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్, గుండయ్య, గోపాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌గ్రూపులు ఏర్పాటు చేయండి

ఎంఈఓ బాలరాజు



మాట్లాడుతున్న ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులతో తరగతుల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి, చదువుపై శ్రద్ధ పెంచేలా చూడాలని ఎంఈఓ బాలరాజు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని వెల్మకన్నలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవిలో బేసిక్స్ మర్చిపోకుండా ఉండేందుకు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులు చిన్న చిన్న లెక్కలు, ఇతర హోంవర్క్ ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులతో సైతం చర్చించాలన్నారు. ఈ నెల 24 నుంచి వేసవి సెలువులు ఉన్నాయని, 23న తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం సరోజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు



రెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్ జ్ఞానజ్యోతి

- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి

అల్లాదుర్గం(మెదక్): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలని వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని రెడ్డిపల్లి, అప్పాజీపల్లి, ముస్లాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, సీఈఓ శివగౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు శేషారెడ్డి, కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, సుభాశ్‌రావు, బల్‌రాం, సాయిరెడ్డి, శ్రీనివాస్, రవి, నర్సింలు, వెంకట్, తుకారం, నాగయ్య సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జ్ఞానజ్యోతి అన్నారు. గురువారం మాసాయిపేట మండలంలోని అచ్చంపేట, మాసాయిపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సిద్దయ్య, డైరెక్టర్ నర్సింలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రుద్రారంలో..

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మన్నన్ కోరారు. మండలంలోని రుద్రారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. మండలంలోని చందంపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ శివకుమార్, ఐకేపీ ఏపీఓ లక్ష్మీనారాయణ, మహిళా సంఘం సభ్యులు, మాజీ సర్పంచ్ స్వామిరాజ్, డైరెక్టర్లు పోచాగౌడ్, సీఈఓ పాషా పాల్గొన్నారు.

రైతుల బకాయిలు చెల్లించాలి: ఎమ్మెల్యే సునీతారెడ్డి



చెన్నాపూర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన పాత బకాయిలు రూ.7 కోట్లు ప్రభుత్వం రైతులకు చెల్లించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని చెన్నాపూర్, చిన్నగొట్టిముక్ల, తిమ్మాపూర్, గుండ్లపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో సన్నరకానికి చెల్లించాల్సిన రూ.500 బోనస్ ఇప్పటివరకు రైతులకు ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. అన్ని రకాల ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలన్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్, ఉప తహసీల్దార్ షఫీయోద్దీన్, ఏపీఓ వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు హరికృష్ణ, మహేశ్‌గుప్తా, మన్సూర్, గోపి, చంద్రగౌడ్, యాదగౌడ్, హన్మంత్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, భిక్షపతి, రాంచంద్రగౌడ్, రాజేందర్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలిరండి

మాజీ ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): వరంగల్‌లో 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు అందరూ తరలి రావాలని మాజీ ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వాల్‌రైటింగ్‌లో ఆయన స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో నిలవగా, ప్రస్తుతం పాతాలంలోకి వెళ్లిందన్నారు. ఏడాది కాలంలోనే ప్రజల్లో కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేఖత మొదలైందన్నారు. ఈ ప్రభుత్వం దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమిలేదన్నారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, అంజనేయులు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు, రమేశ్, చంద్రం, నరేశ్, రాజ్‌కుమార్ ఉన్నారు.

పదకొండేళ్లుగా చలివేంద్రం నిర్వహణ



చలివేంద్రం ద్వారా నీటిని అందిస్తున్న రవీందర్

మెదక్‌జోన్: పదకొండు ఏళ్లుగా వేసవి రాగానే నాలుగు మాసాలపాటు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, వేలాది మంది గొంతు తడుపుతున్నాడు. బల్దియా అధికారులు ఏర్పాటు చేయకున్నా.. ఆయన మాత్రం క్రమం తప్పకుండా నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. మెదక్ జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ పక్కన రాజరాజేశ్వరీ మెడికల్ యజమాని రవీందర్ 2014 నుంచి ప్రతీ వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మట్టి కుండలతో నీటిని అందించిన ఆయన రెండేళ్లుగా ఎలక్ట్రిక్ మిషిన్ ద్వారా నీటిని అందిస్తున్నాడు.